

గంగజాతరకు తిరుపతి సిద్ధం



తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా జరుగుతున్న తిరుపతి గంగ జాతర వేడుకలు ప్రధాన ఘట్టానికి చేరుకున్నాయి.బయటి ప్రాంతాల్లో వుంటున్న తిరుపతివాసులంతా మంగళవారం నాటి జాతరలో పాల్గొని గంగమ్మను దర్శించుకునేందుకు నగరానికి చేరుకున్నారు.దాదాపు లక్షమంది భక్తులు తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటారని అంచనా వేసిన అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టారు. జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసి, ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని సుబ్రమణ్య స్వామి ఆలయానికి ఈవోగా పనిచేస్తున్న రామకృష్ణను దేవాదాయ శాఖ నియమించింది. సోమవారం ఆయన ఆలయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం జరగబోయే ప్రధాన పండుగను అందరి సహకారంతో జయప్రదంగా నిర్వహిస్తామని చెప్పారు. కాగా జాతర చాటింపు నుంచీ విభిన్న రీతుల వేషధారణలతో అలసిన గంగమ్మను శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి తర్వాత అర్చకులు మహాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణతో వజ్రకిరీటాన్ని ధరింపచేశారు.అమ్మవారి అభిషేక దర్శనం కోసం వేలాదిమంది భక్తులు బారులు తీరారు.



ధ్వజారోహణం



శేష వాహన సేవ

శేషుడిపై నృసింహుడి విహారం

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

డక్కిలి, మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగురవేసి సకల దేవతలకూ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కొడి ముద్ద ప్రసాదం కోసం మహిళలు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహించాక ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువు దీర్చి ఆలయంలో గిరి ప్రదక్షిణలు చేశారు. అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పెంచల లక్ష్మీనృసింహుడు ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వగా కోన వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 6 గంటలకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ కార్యక్రమాలను శాస్త్రోకంగా నిర్వహిస్తారు.

పోలీసు వైఫల్యమే!

సిట్ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు

చంద్రగిరి పోలీసుల వైఖరిపై సిట్ నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన హింసాత్మక ఘటనలకు పోలీసుల వైఫల్యమే ప్రధాన కారణంగా సిట్ అధికారులు గుర్తించారు. అలాగే సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా పద్మావతి వర్సిటీ వద్ద నానీపై వైసీపీ శ్రేణులు మారణాయుధాలతో హత్యాయత్నానికి ప్రయత్నించినా సీరియస్‌గా పరిగణించకుండా కేవలం హత్యాయత్నం జరిగిందని 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం సిట్ గుర్తించింది.సీఐ రామచంద్రరెడ్డి వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో 21మందిని నిందితులుగా గుర్తించి 41ఏ కింద నోటీసులు జారీ చేశారు.కూచువారిపల్లిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన దాడులు, ప్రతి దాడులకు సంబంధించి రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర రెడ్డి, మోహిత్ రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వరరెడ్డి, పీఆర్వో బండి వేణుగోపాల రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మూడు కేసుల్లో దాదాపు 64మందిని నిందితులుగా గుర్తించారు. వీరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో వుంచిన సెక్షన్లు సీరియస్‌గా వున్నా భారీసంఖ్యలో వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా కర్రలు, రాడ్లు, రాళ్ళతో టీడీపీ నాయకులు, గ్రామస్తులపై దాడి చేసి గాయపరచిన ఘటనకు సంబంధించి మాత్రం కేవలం ముగ్గురు నిందుతులను మాత్రమే నమోదు చేయడం పోలీసుల పక్షపాతానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి. ఈ నాలుగు కేసుల్లో ఇప్పటివరకూ చంద్రగిరి పోలీసులు ఏ ఒక్క నిందితుడినీ అరెస్టు చేయకపోవడాన్ని సిట్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనిపై సోమవారం చంద్రగిరి డీఎస్పీపై జిల్లాస్థాయి ఉన్నతాధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే బ్రాహ్మణకాలువలో పోలింగ్ రోజు వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య జరిగిన గొడవల్లో దాదాపు 10 మంది గాయపడినట్లు సమాచారం. ఇరువర్గాలను చెదరగొట్టడానికి సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే ఇక్కడ కూడా నిందితులను అరెస్టు చేయలేదని సిట్ సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ గుర్తించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లలో కొత్త సెక్షన్లు చేర్చే విషయమై ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించినా అవసరమైనన్ని బలగాలను నియమించడంలోనూ,ఘటనలను నివారించడంలోనూ పోలీసుల వైఫల్యాన్ని సిట్ నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులపై వేటు పడే అవకాశం వుందని తెలిసింది.



రామిరెడ్డిపల్లెలో ఆదివారం సిట్ అధికారుల విచారణ

ఎన్నికల కేసుల్లో నిందితుల అరెస్టుకు డీజీపీ ఆదేశం

జిల్లాలో సుమారు వంద మందిపై నమోదైన కేసులు

నానీపై దాడి కేసులో 13 మంది మాత్రమే అరెస్టు

మిగిలిన కేసుల్లో నిందితుల అరెస్టుకు ఐదు బృందాల ఏర్పాటు

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలకు సంబంధించిన కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డీజీపీ హరీష్ గుప్తా ఆదేశించారు. ఈనెల 13న పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఇప్పటి వరకూ 13మందిని మాత్రమే అరెస్టు చేశారు. మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయలేదని సిట్ అధికారులు తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో ఇప్పటివరకూ అరెస్టు కాని నిందితులను 24 గంటల్లో అరెస్టు చేయాలని డీజీపీ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా ఎస్పీ నిందితుల అరెస్టు కోసం ప్రత్యేకంగా ఐదు బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన పలు ఘర్షణలకు సంబంధించి జిల్లాలో వంద కంటే ఎక్కువ మందిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణపై పోలింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదుతో 24 మందిపై కేసు నమోదైంది. ఆ ఘర్షణలకు సంబంధించే వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో 20 మందిపై కేసు నమోదైంది. ఇదే 20 మందిపై మోహిత్ రెడ్డి పీఆర్వో బండి వేణుగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.కూచువారిపల్లి మాజీ సర్పంచ్ కవిత, గ్రామస్తురాలు వనజ చేసిన ఫిర్యాదులతో ముగ్గురు వ్యక్తులను పేర్కొంటూ మరికొందరిపై అంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసులోనూ నిందితుల సంఖ్య 20 మంది దాకా వుండే అవకాశముంది. 14వ తేదీ తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరగగా ఆ కేసులోనూ పలువురిపై కేసు నమోదైంది. అక్కడే పోలీసు వాహనం వజ్రపై, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై జరిగిన దాడులకు సంబంధించి పదిమందిపై కేసు నమోదైంది. ఎమ్మార్ పల్లి సీఐపై దాడి కేసులో ఎనిమిదిమందిని నిందితులుగా గుర్తించారు. ఇలా మొత్తం ఎనిమిది కేసుల్లో వంద మందికి పైనే నిందితులుగా కేసుల్లో నమోదయ్యారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం నానీపై హత్యాయత్నం కేసులో 13 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఏడు కేసుల్లో ఒక్కరినీ అరెస్టు చూపలేదు. ఆదివారం ఈ కేసులపై దృష్టి సారించిన సిట్ అధికారులు అరెస్టులు జరగని విషయాన్ని తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో అప్రమత్తమైన డీజీపీ 24 గంటల్లో మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీని ఆదేశించారు.దీంతో నిందితుల అరెస్టు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఎస్పీ రంగంలోకి దించారు. కాగా పులివర్తి నానీపై హత్యాయత్నం సందర్భంగా ఆయన గన్‌మ్యాన్ ధరణి జరిపిన కాల్పుల్లో గాయపడి చెన్నైలో చికిత్స తీసుకున్న నిందితుడొకరు డిశ్చార్జి అయినట్లు తెలిసింది. అతడిని అరెస్టు చేయడానికి అధికారులు చెన్నై వెళ్ళినట్లు సమాచారం. మరోవైపు ఎన్నికల ఘర్షణలకు సంబంధించిన నమోదైన కేసుల్లో అదనపు సెక్షన్లను చేర్చాల్సిన అవసరముందని సిట్ అధికారులు తమ నివేదికలో సిఫారసు చేసినట్లు తెలిసింది.

ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా లక్ష్మీనరసయ్య



తిరుపతి(ఆటోనగర్),మే 20 : ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వై.లక్ష్మీనరసయ్యను నియమితులయ్యారు. సదరన్ డిస్కంలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా వున్న వి.ఎన్. బాబు పదవీ కాలం ముగియడంతో ఫైనాన్స్ విభాగంలో సీజీఎంగా పని చేస్తున్న వై.లక్ష్మీనరసయ్యను అదే విభాగానికి పూర్తి బాధ్యతలతో డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన సీజీఎం బాధ్యతలతో పాటు అదనంగా డైరెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తారు.ప్రభుత్వం ఫైనాన్స్ డైరెక్టర్‌గా మరో వ్యక్తిని నియమించేవరకు ఈయన ఆ పదవిలో కొనసాగుతారు.

తిరుపతి- కాట్పాడి మధ్య నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), మే 20: తిరుపతి-కాట్పాడి స్టేషన్ల మధ్య రోజువారీగా నడుస్తున్న స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.కోయంబత్తూరు-తిరుపతి,విల్లుపురం-తిరుపతి,బెంగళూరు-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఈ తేదీల్లో కాట్పాడి-తిరుపతిల మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు తెలిపారు.తిరుపతిలో రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా రైళ్లను తాత్కాలికంగారద్దు చేస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటింగుకు పకడ్బందీ ఏర్పాట్లు

- తిరుపతి అసెంబ్లీకి మాత్రం స్థలాభావం దృష్ట్యా గుర్తింపున్న పార్టీల ఏజెంట్లకే అనుమతి : కలెక్టర్
- 60 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం
- బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు : ఎస్పీ



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మే 20: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటుకు వేర్వేరుగా కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామన్నారు.జూన్ 4న సీసీ కెమెరాల నిఘాలో ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. తిరుపతి అసెంబ్లీకి 46మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో అంతమంది ఓట్ల లెక్కింపు గదిలో కూర్చునే స్థలం లేనందున ఈసీ గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, మిగిలినవారికి పక్కనే గదిలో కూర్చునేందానికి ఏర్పాటు చేశామని.. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఓట్ల లెక్కింపును పరిశీలించుకోవచ్చన్నారు.ఏఎస్‌డీ జాబితా ద్వారా బోగస్ ఓట్లను అరికట్టడంతో తిరుపతిలో ఓటింగ్‌శాతం తగ్గిందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తామన్నారు.ఎన్నికల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు.కౌంటింగ్ ముగిశాక కూడా 15రోజులు కేంద్రబలగాలు ఇక్కడే వుండి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తాయన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు జరిగిన తరువాత చోటు చేసుకున్న ఘర్షణలపై ఐదు కేసులు నమోదు చేసి 54మందిని అరెస్టు చేశామన్నారు. ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో 60 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, కౌంటింగు నాడు అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తమన్నారు.ఫలితాలపై పందేలు కాస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లో ఎల్లుండినుంచి గజ గణన

మంగళం, మే 20 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణనకు ముహూర్తం నిర్ణయించారు.ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఈ మూడు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు గజ గణన చేపట్టనున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకే సారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఏనుగులు దాడి చేసి పంట నష్టం, ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పడతారు. రెండవ రోజు ట్రాన్సక్టు లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారు.

తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి

ఎస్‌బీ డీఎస్పీగా వెంకటాద్రి నియామకం



తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి డీఎస్పీగా ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి నియమితులయ్యారు. పోలింగు సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై సీరియస్ అయిన ఈసీ ఇద్దరు డీఎస్పీలను, ఇద్దరు సీఐలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.వీరి స్థానంలో తిరుపతి నగర డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం,శాంతి భద్రతలపై పట్టున్న అధికారిగా పేరున్న డీఎస్పీ రవిమనోహరాచారిని నియమించింది.తిరుపతి ఈస్ట్ సీఐగా, తిరుమలలో విజిలెన్సు విభాగంలో, మదనపల్లె డీఎస్పీగా, చిత్తూరులో సీఐగా పనిచేసిన రవిమనోహరాచారి ప్రస్తుతం తిరుపతి ఏసీబీ డీఎస్పీగా వున్నారు.ఎన్నికల హింసాత్మక ఘటనలపై విచారణ జరపడానికి ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందంలో సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారిని నియమించారు. అలాగే తిరుపతి ఎస్బీ డీఎస్పీగా ఎం. వెంకటాద్రి, అలిపిరి సీఐగా రామారావును నియమించారు. ఈయన గతంలో అనంతపురంలో విజిలెన్సు సీఐగా పనిచేసి వీఆర్‌కు బదిలీ అయ్యారు. అక్కడినుంచి ప్రస్తుతం అలిపిరి సీఐగా నియమితులయ్యారు. వీరితో పాటు తిరుపతి, చిత్తూరులో పలు ప్రాంతాల్లో ఎస్‌గా పనిచేసిన విశ్వనాథ చౌదరిని ఎస్బీ సీఐగా నియమించారు.తిరుపతిలో ఎస్బీ ఎస్‌ఐగా కూడా పనిచేసిన ఈయన ప్రస్తుతం అనంతపురంలో వీఆర్‌లో వుంటూ తిరుపతికి వస్తున్నారు. వీరందరూ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

తలకాయ తీసేస్తా..!

- అడ్డదారి దర్శనాలను అడ్డుకున్న హోంగార్డుపై రెచ్చిపోయిన ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి

శ్రీకాళహస్తి, మే 20: ముక్కంటి ఆలయంలో అడ్డదారి దర్శనాలను హోంగార్డు అడ్డుకోవడంపై ఒక ఒప్పంద ఉద్యోగి రెచ్చిపోయాడు. 'నన్నే ఆపుతావా.. నీ తలకాయ తీసేస్తా.. బయటకు రా నీ అంతు చూస్తా... కత్తితో పొడిచేస్తా.ఏమనుకుంటున్నావు ' అంటూ హడలెత్తించాడు. దీంతో వణికిపోయిన హోంగార్డు వైర్‌లెస్ సెట్‌లోనే అధికారులకు బెదిరించడంపై తన ఆవేదనను వ్యక్తం చేశాడు. దీంతో ఆలయం నలుమూలల్లో హోంగార్డుపై బెదిరింపు మాటలు సోమవారం మార్మోగాయి.శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు వైసీపీ నేతలతో సన్నిహితంగా ఉంటాడు. రెండేళ్ల క్రితం అధికార పార్టీ సిఫార్సుతో పీఆర్వో కార్యాలయంలో ఉచిత సేవకుడిగా చేరాడు. అక్కడినుంచి అధికారులతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూ అడ్డదారి దర్శనాలు చేయిస్తూ ఆర్థికంగా బలపడ్డాడు.ఓ అధికారి అండతో మూడు నెలల క్రితం దేవదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి ఒప్పంద ఉద్యోగిగా నియామకం పొందాడు.అయితే తమకు సంబంధం లేకుండా ఓ అధికారి సాయంతో ఒప్పంద ఉద్యోగి కావడంపై అధికార పార్టీ నేతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ యువకుడికి సహకరించిన అధికారిని నిలదీశారు.ఆ తరువాత ఏం జరిగిందో కానీ అధికారులు, వైసీపీ నాయకుల మధ్య సయోధ్య కుదిరింది. ఈ యువకుడి తరహాలోనే మరో ఏడుగురు ఒప్పంద ఉద్యోగులుగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు.ఒప్పంద ఉద్యోగిగా మొదట చేరిన యువకుడు అడ్డదారిలో దర్శనాలు చేయించేందుకు యథేచ్ఛగా ఆలయంలోకి చొరబడేవాడు.అంతేకాకుండా ఆలయ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.సోమవారం ఆలయంలో పెద్దఎత్తున రద్దీ నెలకొనడంతో క్యూలైన్లు స్తంభించిపోకుండా భద్రతా సిబ్బందికి అధికారులు పలు ఆంక్షలు సూచించారు.అద్దాల మండపం వద్ద భక్తులు వెలుపలకు వచ్చే గేటు దగ్గర రాజేష్ అనే హోంగార్డుకు విధులు కేటాయించారు. భక్తులు వెలుపలకు వచ్చే క్యూలైన్‌లో ఎవరూ ఎదురు వెళ్లకుండా హోంగార్డు అడ్డుకట్ట వేశాడు. అయితే ఒప్పంద ఉద్యోగి ఓ భక్తుల బృందాన్ని తీసుకుని వ్యతిరేక దిశలో వెళ్లేందుకు అద్దాల మండపం వద్దకు చేరుకున్నాడు. అక్కడ హోంగార్డు రాజేష్ అడ్డదారిలో ప్రవేశించేందుకు అనుమతించలేదు. దీంతో ఆగ్రహానికి గురైన ఒప్పంద ఉద్యోగి వాగ్వాదానికి దిగాడు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకువస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ హోంగార్డు తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు.ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఫోన్‌లో అధికారులకు జరిగిన వాగ్వాదంపై ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ అడ్డదారి దర్శనానికి అనుమతి ఇవ్వకపోవడంతో హోంగార్డు గేట్ తెరవలేదు. దీంతో ఒప్పంద ఉద్యోగి భక్తులందరూ చూస్తుండగానే కత్తితో పొడిచేస్తా... తల తీసేస్తానంటూ ఊగిపోయాడు. ఇంతలో హోంగార్డు భయాందోళనకు గురై ఒప్పంద ఉద్యోగి తనను దూషించిన విషయాన్ని వైర్‌లెస్‌సెట్ ద్వారా అధికారులకు తెలిపాడు. ఆలయ పరిసరాల్లోని అన్ని విభాగాల్లో పనిచేసే అధికారుల వద్ద వైర్‌లెస్ సెట్లు ఉంటాయి. దాంతో ఒప్పంద ఉద్యోగి నిర్వాకం అన్ని వైర్‌లెస్‌సెట్లలో మార్మోగింది.ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇంతటి భయంకరమైన పదజాలంతో బెదిరించడంపై అధికారులు, ఉద్యోగులు, ఆలయ సిబ్బంది హతాశులయ్యారు.

నయనరగడ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి (కల్చరల్) మే 20: చక్రపాణి రంగనాథకవి రచించిన నయనరగడ లఘుకావ్య సంవీక్షణం అనే పుస్తకాన్ని సోమవారం స్థానిక ఎయిర్ బైపాస్ మార్గంలోని రాస్ భవనంలో జరిగిన సభలో ఆవిష్కరించారు. సభకు అధ్యక్షులుగా పంచ సహస్రావధాని మేడసాని మోహన్, ఆత్మీయ అతిథిగా దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో, డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్. రామారావు హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయపీఠం సంచాలకులు డాక్టర్ కలువగుంట రామమూర్తి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర నాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాలడుగు మునిరత్నం నాయుడు, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జీఎన్ సత్యనారాయణ సింగ్ హాజరయ్యారు. విశ్రాంత తెలుగు ఆచార్యులు కె.సర్వోత్తమరావు పుస్తకావిష్కరణ చేశారు. శతావధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో పుస్తక రచయిత, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, డాక్టర్ బత్తల శ్రీరాములు, డాక్టర్ పురుషోత్తమాచారి, ఏనుగు అంకమ నాయుడు, వేమూరి జయరామ్ ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయిత శ్రీరాములు కుటుంబం, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి వర్ధంతి

తిరుపతి (కల్చరల్) మే 20: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, టీయూబీఎస్ కార్యదర్శి సీఆర్‌కే కేశవరావు, ఏ.శమంతకమణి, బి.జయలక్ష్మి, అపర్ణ తదితరులు పాల్గొని ఆంధ్రకేసరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళి అర్పించారు.

నీటి పొదుపులో మహిళా వర్సిటీ ముందడుగు

జలశక్తి కమిటీ పరిశీలనలో వెల్లడి


మహిళా వర్సిటీ పరిశీలనకు వచ్చిన జలశక్తి కమిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20: నీటి పొదుపులో పద్మావతి మహిళా యూనివర్సిటీ ముందడుగు వేస్తోంది. నీటిని పొదుపు చేయడంతో పాటు సంరక్షించడంలోనూ వర్సిటీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ విషయం సోమవారం యూనివర్సిటీని సందర్శించిన జలశక్తి కమిటీ పరిశీలనలో వెల్లడైంది. గత డిసెంబరులో జాతీయ నీటి పురస్కారానికి వర్సిటీ దరఖాస్తు చేసుకోగా, జలశక్తి కమిటీ సోమవారం వర్సిటీని పరిశీలించింది. తొలుత వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ఐక్యూఏసీ సమన్వయకర్త త్రిపురసుందరి, బయో టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ జాన్ సుష్మాతో సమావేశమయ్యారు. అనంతరం యూనివర్సిటీలో నీటి పొదుపు, సంరక్షణ, నిల్వ, ఇంకుడు గుంతలు, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, గ్రీన్ హౌస్ తదితర అంశాల్లో వర్సిటీ పాటిస్తున్న విధానాలను వారు పరిశీలించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి మృతి



పాకాల, మే20: పాకాల-పూతలపట్టు రైల్వే మార్గం ఊట్ల వారిపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు చిత్తూరు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతుడు నలుపు రంగు డ్రాయర్, బ్లూ కలర్ చెక్స్ షర్టు ధరించి మెడలో స్టీల్ గొలుసు వుంది. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి లేదా రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సోమవా రం ఉదయం మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 9494228854 నంబరుకు తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

వైసీపీ నుంచి ఎమ్మార్సీ రెడ్డి సస్పెన్షన్



చంద్రగిరి, మే 20: ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎర్రావారిపాలెం మండలం ఉదయమాణిక్యం గ్రామా నికి చెందిన వైసీపీ నేత ఎమ్మార్సీ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడైన ఎమ్మార్సీ రెడ్డి ప్రస్తుతం వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా ఉన్నారు. ఎర్రావారిపాలెం, తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లో వైసీపీలో చురుగ్గా ఉన్న నాయకులను టీడీపీలోకి పంపించడంలో ఈయన హస్తం ఉందని, తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.

జాతర వేళాయె!


సున్నపు కుండలతో కైకాల వంశస్తులు


కిటకిటలాడుతున్న గంగమ్మ ఆలయం




గంగమ్మకు ఎమ్మెల్యే చెవిరెడ్డి సారె


సారెతో మేయర్ దంపతులు





సున్నపు కుండలతో గంగమ్మ మొక్కు తీర్చుకున్న భక్తులు

తిరుపతి(కల్చరల్), మే 20: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఆరవ రోజైన సోమవారం భక్తులు సున్నపు కుండలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర మంగళవారంతో ముగియనుండటంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. సాయంత్రం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలిసి శాసనసభ్యుడు కరుణాకరరెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక అనంతవీధి నుంచి సాగిన శోభాయాత్రలో నగర మేయర్ శిరీష, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● సప్పరాలే నేటి ప్రత్యేకత

జాతరలో చివరి రోజైన మంగళవారం భక్తులు అమ్మవారికి సప్పరాలు సమర్పించి సేవిస్తారు.గోపురాలను పోలిన వెదురు దబ్బలతో తయారుచేసి వాటిని శరీరంపై నిలబెట్టుకోవడం కోసం నడుంకు కట్టుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేరతాయన్న నమ్మకంతో శరీర ఆకృతికి అనుగుణంగా సప్పరాలను ఏర్పాటు చేసుకుంటారు. డప్పుల వాయిద్యాలకు లయబద్ధంగా చిందులు వేస్తూ వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకుంటారు. సోమవారం రాత్రి నుంచి భక్తులు మొదట శరీరమంతా గంధం పూసుకుని మెరిసే దుస్తులను నడుంకి ధరిస్తారు. మల్లెపూలను తలకు పాగాలా చుట్టుకుంటారు. వెదురు పుల్లలు తెచ్చి నట్టింట పెట్టి కుంభం వేసి హారతులు ఇస్తారు. వెదురు దబ్బలు గోపురం ఆకారంలో తయారుచేసి రంగు రంగు కాగితాలను అతికించి గోపురంలో బొమ్మల్లాగా బెండ్లతో కళాత్మకంగా తయారు చేసి అమరుస్తారు. చిందులు వేసుకుంటూ అమ్మవారిని దర్శించుకుంటారు. సప్పరాల భక్తులకు దర్శనం సమయంలో ఆలయ అధికారులు ప్రాధాన్యత ఇస్తారు. ఇటీవల కాలంలో సప్పరాలు, సారెల సంప్రదాయం బాగా తగ్గిపోయింది.

● నేడు పేరంటాల వేషం

పేరంటాల వేషాన్ని కూడా కైకాలవాళ్లే ధరిస్తారు. ఎర్రగళ్ల చీరను కట్టి, ఎర్రని గుడ్డలో ఒడిబాలను కట్టుకుంటారు. అందులో అక్షింతలు, చవ్వాకు, దువ్వెన, అద్దం, నల్లగాజులు, పసుపు, కుంకుమలు ఉంచుతారు. తలకు నల్లని గుడ్డను కట్టి కొప్పులా ముడివేసుకుంటారు. తలపై బంగారంలా కనిపించే అట్టతో చేసిన జడ బిళ్లలు, పట్టీల వంటి ఆభరణాలు కట్టుకుంటారు. పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుంచి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ నుంచి బుధవారం వేకువజామును చిన గంగమ్మ చెంపనరికి ఆ తరువాత పెద గంగమ్మ చెంపను నరకడంతో జాతర ముగుస్తుంది.

● గంగమ్మ నాటక ప్రదర్శన నేడు

జాతర సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7గంటలకు ఇందిరామైదానంలో గంగమ్మ నాటక ప్రదర్శన జరుగనుంది. అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గత ఏడాది రూపుదిద్దుకున్న గంగమ్మ నాటకానికి బీఎన్ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. గంగమ్మ పాత్రధారిగా ప్రముఖ భరతనాట్య కళాకారిణి శైలజా రెడ్డి నటిస్తున్నారు.



కన్యకాపరమేశ్వరి ఆలయ సారె సమర్పణ


గంగమ్మకు సారెను సమర్పిస్తున్న కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మే 20: కన్యకాపరమేశ్వరి దేవస్థానం, ఆర్య వైశ్య సంఘం తరపున సోమవారం మధ్యాహ్నం తాతయ్యగుంట గంగమ్మకు సారెను సమర్పించారు. పంగులూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం గౌరవ అధ్యక్షుడు గుబ్బ చంద్రశేఖర్, కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు పామిడి సత్యనారాయణశెట్టి, కోమలదేవి, కార్యదర్శి దిందుకుర్తి నరసింహులు, కన్వీనర్ శ్రీధర్, రామ్మూర్తి, సురేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ మళ్లింపు : ఎస్పీ


గంగమ్మ ఆలయ పరిసరాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 20: గంగ జాతరకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఎస్పీ హర్షవర్ధనరాజు సోమవారం గంగమ్మ ఆలయ పరిసరాలను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా ట్రాఫిక్‌ను మళ్లించి ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. దాదాపు 800 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు ఆపే విధంగా చర్యలు చేపట్టారు. క్రైం ఏఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో చైన్ స్నాచింగ్‌లు, ఇతర అసాంఘిక సంఘటనలు జరగకుండా ఆదేశాలు జారీ చేశారు. నేడు, రేపు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆలయానికి భక్తులు చేరుకునే అన్ని మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించడానికి డీఎస్పీ చర్యలు తీసుకుంటున్నారు.ఆయన వెంట ఏఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు, రాజేంద్ర, విమలకుమారి తదితరులున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

బాలిక మృతి, ఐదుగురికి గాయాలు


మృతి చెందిన అయిషా సమీన


ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

నారాయణవనం, మే 20: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన నారాయణవనం మండలం గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద సోమవారం రాత్రి జరిగింది. రేణిగుంట బుగ్గవీధికి చెందిన రజాక్ అహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి నాగలాపురం మండలం టీపీ కోట వద్ద ఓ శుభకార్యానికి వెళ్లారు. సోమవారం రాత్రి కారులో రేణిగుంటకు వెళ్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న మరో కారు గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రజాక్ అహ్మద్(35), అతని భార్య యాస్మిన్(29), కుమార్తె అయిషా సమీన(10), కుమారులు షాధిక్ అహ్మద్(8), రెహ్మాన్ అహ్మద్(1), కారు డ్రైవర్ బషీర్(58) గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఆయిషా సమీనా(10) మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జయరాం నాయక్ తెలిపారు.

నానీపై దాడి కేసులో అమాయకుల బలి

నిందితులు సుధాకరరెడ్డి భార్య, సోదరి, హరికృష్ణ తల్లి ఆవేదన


మీడియాతో మాట్లాడుతున్న హరిత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20: మహిళా యూనివర్సిటీ వద్ద పులివర్తి నానీపై జరిగిన దాడి కేసులో పోలీసులు కొందరు అమాయకులను బలి చేశారని నిందితుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ నానీపై దాడి కేసులో అరెస్టు అయిన సుధాకరరెడ్డి భార్య మహేశ్వరి, సోదరి హరిత, హరికృష్ణ తల్లి భువనేశ్వరి కన్నీటి పర్యంతమయ్యారు. ఇటీవల తిరుమలలో యువత మధ్య వివాదం రేగిందన్నారు. తమ కుటుంబ సభ్యులు ఇద్దరినీ కూడా మందలించి పంపమని స్వయానా తామే పోలీసులను కోరామన్నారు. దీంతో సుధాకరరెడ్డి, హరికృష్ణను అదుపులోకి తీసుకొని నానీపై హత్యాయత్నం కేసులో పోలీసులు ఇరికించారని ఆరోపించారు. ఈ ఘటనతో తమ కుటుంబ సభ్యులకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు, సిట్, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలన్నారు. తద్వారా దాడితో సంబంధం లేని వారికి కేసు నుంచీ ఊరట కలిగించాలని కోరారు. తమ కుటుంబ సభ్యులు జైలు పాలు కావడంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. భార్యా పిల్లలు అనాథలయ్యారని చెప్పారు. అసలు దోషులను అరెస్టు చేసి, అమాయకులైన తమ కుటుంబ సభ్యులను విడుదల చేయాలని కోరారు. లేకపోతే పోలీసులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కేసులో రామచంద్రాపురం మండలానికి చెందిన పి. సుధాకరరెడ్డి ఉండగా, ఎ. సుధాకరరెడ్డిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నానీపై దాడి జరిగిన రోజు హరికృష్ణ తమిళనాడులోనూ, సుధాకరరెడ్డి పాపవినాశనంలో షాపులోనూ ఉన్నట్టు వీడియో రికార్డులు ఉన్నాయన్నారు. వీటిని పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

తడ రైల్వేస్టేషన్ నుంచి కొబెల్కో క్రేన్ల రవాణా

శ్రీసిటీ పరిశ్రమల ఉత్పత్తుల రవాణాకు ఊతం ● తడ నుంచి ప్రత్యేక రైలు రవాణా సదుపాయం



సత్యవేడు, మే 20: శ్రీసిటీలోని ఎక్స్‌కవేటర్ల తయారీ సంస్థ కొబెల్కో తమ ఉత్పత్తులైన ఎక్స్‌కవేటర్లు, క్రేన్లను తడ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేసింది. ఇది తడ రైల్వేస్టేషన్ నుంచి శ్రీసిటీలోని పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించి మొట్టమొదటి ప్రత్యేక రైలు రవాణా కావడం విశేషం. మొట్టమొదట సారి 35 ఎక్స్‌కవేటర్లను కొబెల్కో సంస్థ తరలించింది. ఈ రవాణా కోసం తడ రైల్వేస్టేషన్‌లో మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలు, కంటైనర్ జోన్, తదితర సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వేశాఖ చొరవ చూపాలని శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి కోరారు.

విమానం రద్దు కావడంతో

ప్రయాణికుల నిరసన



టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

రేణిగుంట, మే 20 : తిరుపతి విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం ఒక విమాన సర్వీసు రద్దు కావడంతో ప్రయాణికులు నిరసన తెలిపారు.బెంగళూరు నుంచి సాయంత్రం 3.10గంటలకు తిరుపతి చేరుకుని తిరిగి 4.20గంటలకు గుల్బర్గాకు స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం పోవాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా సర్వీసు రద్దయింది. అయితే ఒకటిన్నర గంట ముందుగా 32మంది ప్రయాణికులు విమానాశ్రయం చేరుకున్నారు. విమాన సర్వీసు రద్దయిన విషయం తెలుసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్టార్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం స్పందించకపోవడంతో టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.మంగళవారం వస్తే గుల్బర్గాకు యధాతథంగా పంపిస్తామని చెప్పడంతో కొంతమంది టిక్కెట్ డబ్బులు తీసుకుని వెళ్లిపోగా కొంతమంది ఆ ప్రతిపాదనకు ప్రయాణించేందుకు అంగీకరించారని సమాచారం.

పులివర్తి నానీకి ప్రముఖుల పరామర్శ


నానీని పరామర్శిస్తున్న సోమిరెడ్డి

తిరుచానూరు, మే20: ఈ నెల 14న వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని సోమవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, బంగారుపాళెం మండల పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, తిరుపతి టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులిగోరు మురళి, పాకాల జడ్పీటీసీ పద్మజారెడ్డి ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు తెగబడుతోందని ఆరోపించారు. పులివర్తి నానికి భారీ మెజార్టీ ఖాయమన్నారు.

పులివర్తి నానీ ఆరోగ్యం కోసం పూజలు

భాకరాపేట, మే 20: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం కుదుటపడాలని భాకరాపేట కోదండ రామాలయంలో సోమవారం టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామోదరం, శ్రీధర్ రాయల్, తులసీ రాయల్, కళ్యాణ్, రఫీ, కార్తికర్, తేజ, హరీశ్, బాలు, గురు, నితీశ్, దిలీప్, పవన్, రెడ్డి, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో కౌంటింగ్‌కు జాగ్రత్తలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచన



స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20: వర్ష సూచన నేపథ్యంలో జూన్ 4వ తేదీన కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మహిళా యూనివర్శిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూం భద్రత, కౌంటింగ్‌కు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేకించి వర్ష సూచన ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కులశేఖర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసరావు, సూళ్లూరుపేట ఆర్డీవో మధుసూదన్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ చంద్రముని, జిల్లా సర్వే అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జయరాజ్ పాల్గొన్నారు.

రుయాలో అందని అత్యవసర వైద్యం

విలవిల్లాడిపోయిన రోగి



రుయా అత్యవసర విభాగం ముందు నొప్పితో బాధపడుతున్న రోగి

తిరుపతి(వైద్యం), మే 20: అత్యవసర వైద్యం అందక రోగి అవస్థలు పడిన సంఘటన రుయాస్పత్రిలో చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో కాలుకి తీవ్రమైన గాయమైన వ్యక్తిని 108 సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి రుయాస్పత్రి అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. సదరు వ్యక్తి మాట్లాడే పరిస్థితిలో లేకపోవడం, సహాయకులు లేకపోవడంతో అత్యవసర విభాగంలోని వైద్యులు.. సిబ్బంది సాయంతో అతడిని వెంటనే ఆస్పత్రి బయట విడిచిపెట్టేశారు. దీంతో ఓ పక్క రక్తం పోతున్నా సోమవారం ఉదయం 8 గంటల వరకు రుయాస్పత్రి ప్రధాన గేటు ముందరే ఆ వ్యక్తి విలవిల్లాడుతున్నా పట్టించుకున్న నాథులు లేరు. ఈ విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది అత్యవసర విభాగంలోని వైద్యులకు చెప్పినా వారు పట్టించుకోలేదు. హెల్త్ సూపర్‌వైజరు ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లడంతో 9 గంటల సమయంలో ఆ వ్యక్తిని అత్యవసర విభాగంలోకి తీసుకువెళ్లి వైద్యం అందించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అత్యవసర విభాగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తిరుపతిలో ఆరణిదే విజయం: కాపునాడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20: తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు గెలుపు తథ్యమని కాపునాడు నేతలు స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం కాపునాడు నేత గుట్ట నాగరాజ రాయల్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు ఆ పార్టీని తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో కూటమికి ప్రజలు ఓట్లు వేశారని చెప్పారు. ఆరణి శ్రీనివాసులుకు ఓటు వేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. క్రికెట్ విజయ్, అళ్వార్ మురళి, హిమకుమార్, హేమంత్, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

24నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరు కానున్న 5,530మంది విద్యార్థులు
- ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు: డీఆర్వో



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20: జిల్లాలో 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న ప్రారంభమై జూన్ 3వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 5,530మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వారి కోసం 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటలవరకు జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45గంటలకే చేరుకోవాలన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించమని తెలిపారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు, ఓపెన్‌స్కూల్ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి పరీక్షాకేంద్రం వద్ద తాగునీటి వసతి కల్పించి, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంటు ఎగ్జామినర్ గురుస్వామిరెడ్డి, ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బలిజపల్లివాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), మే 20: తిరుపతి నగరంలోని లీలామహల్ సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు.. సత్యసాయి జిల్లా ఓబులదేవర చెరువు మండలం, బలిజపల్లికి చెందిన కొట్టం నరసింహయ్య అనారోగ్యంతో రెండు రోజుల క్రితం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో వైద్యం చేయించుకున్నాడు. అనంతరం తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని సోమవారం సాయంత్రం లీలామహల్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా, బస్టాండు నుంచి నంద్యాల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో నరసింహయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అలిపిరి పోలీసులు బస్సును సీజ్ చేసి, మృతదేహాన్ని రుయాస్పత్రికి తరలించారు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో 5జీ సేవలు

- భవిష్యత్తులో రోబోటిక్ సర్జరీలు
- ట్రాయ్ చైర్మన్ అనిల్‌కుమార్ లాహోటి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ లాహోటి

తిరుపతి(వైద్యం), మే 20: ఇప్పటికే దేశ విదేశాల్లో రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయని, దీనికితోడు 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాక ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రతీ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు, వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయని ట్రాయ్ చైర్మన్ అనిల్‌కుమార్ లాహోటి పేర్కొన్నారు. స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో 5జీ వినియోగ కేసులు అనే అంశంపై సోమవారం వర్క్ షాప్ నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అన్నీ రంగాలు 5జీపైనే ఆధారపడుతాయని, దీనివలన బోధన, వైద్యం అందించడం ఎంతో సులభమవుతుందన్నారు. అనంతరం దేశంలో 5జీ సేవల వినియోగం, వాటి ఆవశ్యకతలను గురించి ఆయన వివరించారు. టీటీడీ జేఈవో గౌతమి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్, ట్రాయ్ సెక్రటరీ రఘునందన్, ఐజీ టెలికాం అధికారులు రాజారెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి సేవలో టీటీడీ మాజీ ఈవో శర్మ

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఈవో ఏపీవీఎన్ శర్మ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం టీటీడీ పరకామణి సిబ్బంది లెక్కించారు. ఈమేరకు రూ.3.87 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 86,721 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 39,559 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్ నా టార్గెట్

గ్రాండ్ మాస్టర్ గుకేష్



తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తాను ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించానని, అయితే ఛాంపియన్ కావడమే తన మెయిన్ టార్గెట్ అని చెస్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో గుకేష్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం గుకేష్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కొన్ని టోర్నమెంట్లు ఆడనున్నట్టు తెలిపారు.

రేపు నృసింహ జయంతి

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 22వ తేదీన నృసింహ జయంతి నిర్వహించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ప్రతిఏటా వైశాఖ మాసం స్వాతి నక్షత్రంలో నృసింహ జయంతి నిర్వహిస్తారు. యోగ నరసింహస్వామి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తారు. తిరుమలలోని వసంత మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నరసింహ స్వామి పూజ నిర్వహిస్తారు.

డాక్టరేట్ ప్రదానం



బాలాజీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20: ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ పరిశోధకులు మద్దిసెట్టి బాలాజీ డాక్టరేట్ పొందారు. సైనోమెట్రిక్ అనాలసిస్ ఆఫ్ పబ్లికేషన్స్ ఇన్ ద జర్నల్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ అంశంపై ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎల్లుండి వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 23వ తేదీన వైశాఖ పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడ వాహనసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషిడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

గరుడుడిపై గోవిందుడి విహారం





పల్లకిలో మోహినీ అవతారంలో.. గరుడవాహనంపై గోవిందుడు

తిరుపతి(కల్చరల్), మే 20: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు మోహినీ అవతారంలో గోవిందరాజులు పల్లకీలో ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు స్వామి వారికి ఊంజల్ సేవ జరిగింది. తరువాత రాత్రి 7 గంటలకు స్వామి వారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడుని అధిరోహించి మాడవీధుల్లో వేచి ఉన్న భక్తులకు కనువిందు చేశారు. నాలుగు మాడ వీధుల్లో భక్తులు స్వామి వారికి హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వాహనసేవ ముందు వేదపండితులు, జియ్యరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ ముందుకు కదిలారు. అంతకు ముందు తిరుమల శ్రీవారి నుంచి సోదరుడు గోవిందరాజులకు రూ.పది లక్షల విలువైన ఆభరణాలు కానుకగా వచ్చాయి. వీటిని ఆలయం వద్ద టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆలయ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయరు స్వామి, చిన్నజీయరు స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, భక్తులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు:

బ్రహ్మోత్సవాలలో భాగంగా 21వ తేదీ మంగళవారం ఉదయం హనుమంత వాహనం, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు గజవాహన సేవ జరుగనుంది.







వాహన సేవల ముందు సాంస్కృతిక ప్రదర్శనలు

ఆర్చరీ ఆసియా కప్ పోటీలకు గణేష్ మునిరత్నం ఎంపిక



నాయుడుపేట, మే 20: దక్షిణ కొరియాలోని సువాన్ కేంద్రంలో జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు జరిగే 2024 ఆర్చరీ ఆసియా కప్ పోటీలకు నాయుడుపేట పట్టణానికి చెందిన తిరుమూరు గణేష్ మునిరత్నం ఎంపికయ్యాడు. బాల్యం నుంచి ఆర్చరీ పట్ల ఆసక్తి చూపుతున్న యువ క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు, రజక పతకాలు సాధించాడు. గణేష్ మునిరత్నం ఆసియా కప్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఏపీ ఆర్చరీ సంఘ కార్యదర్శి సత్యనారాయణ, కమల కిషోర్ తదితరులు అభినందనలు తెలిపారు.

కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్, మే 20 : పట్టణానికి సమీపంలోని తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరి మాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు అంకు ర్పాణతో ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు సోమవారం బ్రహ్మోత్సవాల ప్రారంభానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, మే 20: పట్టణంలోని బాలాజీ గ్రీన్‌సిటీ, బీఎంఆర్ నగర్, లోతువానిగుంట, పాత బీడీకాలనీ, కొత్తబీడీకాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. ఫీడర్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో శిశువు మృతి

బాధితుల ఆందోళనతో డాక్టర్ పరార్



వాకాడు, మే 20: సుఖప్రసవం చేస్తానని చెప్పిన వైద్యుడు మృత శిశువును చేతిలో పెట్టడంతో బాధితులు ఆందోళనకు దిగారు. వారి కథనం మేరకు... నిడిగుర్తి పంచాయతీ నలగాముల గ్రామానికి చెం దిన ముంగర చెంచురెడ్డి భార్య వాసంతికి పురిటి నొప్పులు రావడంతో శనివారం మధ్యాహ్నం నిడిగుర్తి వైద్యశాలకు వెళ్లి డాక్టర్ రామకృష్ణను కలిశారు. డాక్టర్ పరిశీలించి తమ ఆస్పత్రిలోనే సుఖప్రసవం చేస్తానని చెప్పడంతో ఒప్పుకున్నారు.అరగంటలో అయిపోతుందని చెప్పిన డాక్టర్ తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందిన మగ శిశువును అప్పజెప్పడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మీ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ సోమవారం ఉదయం వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టడంతో డాక్టర్ అక్కడినుంచి జారుకున్నారు.

తాటిముంజలకు పెరిగిన డిమాండ్



గూడూరు, మే 20: వేసవిలో మాత్రమే దొరికే తాటిముంజలకు డిమాండ్ పెరిగింది. గూడూరు చుట్టుపక్కల ఉన్న చిల్లకూరు, సైదాపురం, తూర్పు పూండ్ల, బద్దె వోలు తదితర గ్రామాల నుంచి తాటిమంజ లను తీసుకువచ్చి పట్టణంలోని పలు కూడళ్లల్లో విక్రయిస్తున్నారు.వేసవి తాపం తీరేందుకు తాటిముంజలను తినేందుకు ఇష్టపడుతున్నారు. కొంతమంది తాటికాయలను తీసుకువచ్చి వినియోగదారుల ముందే కొట్టి ముంజలను వేరు చేసి ఇస్తున్నారు. డజను రూ.50కు విక్రయిస్తున్నారు. మరికొంతమంది తాటికాయల నుంచి వేరు చేసిన ముంజలను డజను రూ.40కు విక్రయిస్తున్నారు. గతేడాది నాలుగు ముంజలు రూ.10 పలికాయి.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, మే 20: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతినెలా నిత్యావసరాలను అందిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఎన్.నాగులు, బి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ఎస్ఎల్ఎన్‌బాబు, టి.శ్రీనివాసులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, నాగరాజారెడ్డి, సుమ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, మే 20: మండలంలోని చెన్నూరులో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మధుసూదన్‌బాబు సోమవారం తెలిపారు. 3వ తరగతిలో 32 సీట్లు, 4వ తరగతిలో 35, 5వ తరగతిలో 23, 6వ తరగతిలో 27, 7వ తరగతిలో 11, 8వ తరగతిలో 7, 9వ తరగతిలో 16 సీట్లున్నాయని తెలిపారు. వివరాలకు నెం. 9441736136, 6300613644, 9885944982, 9603624251లలో సంప్రదించవచ్చు.

ప్రభుత్వ స్థల కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు, మే 20: మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లిలో మనోహర్ నాయుడు అనే వ్యక్తి ప్రభుత్వ భవనంతో పాటు కొంత స్థలాన్ని ఆక్రమిం చుకున్నారని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పశువైద్యశాల భవనంతో పాటు కొంత స్థలాన్ని ఆక్రమించుకుని పిల్లర్లు వేసి ఇంటిని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రసాదరావును వివరణ కోరగా వీఆర్వోను విచారణకు పంపామన్నారు. నిర్మాణ పనులను అడ్డుకున్నామని చెప్పారు. అలాగే తాళ్వాయిపాడు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖి నది తీరాన సీలింగక్ష భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ ప్రహరీని తొలిగించాలని ఆర్ఐ సంతోషిబాయిను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్పీ ప్రసాద్‌రావు, ఎం.గురునాథం, పవన్‌కల్యాణ్, వెంకటకృష్ణయ్య, నాగరాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహవాసులను వీడని సమస్యలు



గృహాల మధ్య పెరిగిన చెట్లు - చెదలు పట్టడంతో దెబ్బతిన్న ద్వారబంధంనం - ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు, మే 20: పేదల సొంతింటి కల నేరవేర్చాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో టిడ్కో గృహాలను నిర్మించింది. తీరా పంపిణీ సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాయిదా పడింది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల కొంతమందికి గృహాలు పంపిణీ చేశారు. అయితే వసతులు కల్పించకపోవడంతో సమస్యలతోనే కాపురం చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో గాంధీనగర్ ప్రాంతంలో 5,120 టిడ్కో గృహాలను నిర్మించారు. ఇందులో 2,800 మంది లబ్ధిదారులకు ఇటీవల గృహలను అందజేశారు. ఆ ఇళ్లలో కూలీలు, వీధి వ్యాపారులు ఉన్నారు. వీరు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. వారానికి ఒక్క రోజు మాత్రమే పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని, అది కూడా అవసరాలకు సరి పోవడం లేదంటున్నారు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్లను పంపితే ఆ నీటిని పట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నామని చెబుతున్నారు. నీటి కోసం ఇబ్బంది పడలేక సుమారు 1000 కుటుంబాలు ఖాళీ చేసినట్టు చెబుతున్నారు. మూసి వేసిన ఇళ్ల ద్వారబంధనాలకు చెదలు పట్టాయి. ఇక గృహ సముదాయ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. విషసర్పాల సంచారం అధికంగా ఉంటోంది. ఈ సమస్యలపై పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదంటున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ గృహలకు రంగులను మార్చిందేకానీ వసతుల కల్పను చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

తడ రైల్వేస్టేషన్ నుంచి కొబెల్కో క్రేన్ల రవాణా

శ్రీసిటీ పరిశ్రమల ఉత్పత్తుల రవాణాకు ఊతం ● తడ నుంచి ప్రత్యేక రైలు రవాణా సదుపాయం



తడ రైల్వేస్టేషన్ నుంచి రవాణా అవుతున్న ఎక్స్‌కవేటర్లు

తడ, మే 20: శ్రీసిటీలోని ఎక్స్‌కవేటర్ల తయారీ సంస్థ కొబెల్కో తమ ఉత్పత్తులైన ఎక్స్‌కవేటర్లు, క్రేన్లను తడ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేసింది. ఇది తడ రైల్వేస్టేషన్ నుంచి శ్రీసిటీలోని పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించి మొట్ట మొదటి ప్రత్యక్ష రైలు రవాణా కావడం విశేషం. మొట్టమొదట సారి 35 ఎక్స్‌కవేటర్లను కొబెల్కో సంస్థ తరలించింది. ఉత్తర భారతదేశానికి రైలు రవాణ దిశగా పెరుగుతున్న డిమాండు దృష్ట్యా తమ భారీ వాహనాల రవాణాకు ఈ సదుపాయాన్ని ఎంచుకున్నట్లు కొబెల్కో ప్రతినిధి తెలిపారు. దీంతో పాటు ఈ రైలు రవాణా ద్వారా 20శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. ట్రక్కుల ద్వారా చేసే రోడ్డు రవాణాతో పోలిస్తే ఈ పద్ధతిలో కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. తడ రైలు రవాణా సేవలపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ రవాణా కోసం తడ రైల్వేస్టేషన్‌లో మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలు, కంటైనర్ జోన్, తదితర సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వేశాఖ చొరవ చూపాలని కోరారు. శ్రీసిటీతో పాటు పరిసర ప్రాంతాల పరిశ్రమలకు ఇది అత్యంత ప్రయోజనకరమైన సదుపాయంగా ఆయన వ్యాఖ్యానించారు. తడ రైల్వే స్టేషన్ నుంచి రవాణా సదుపాయం పట్ల శ్రీసిటీ పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వైసీపీ నుంచి ఎమ్మార్సీ రెడ్డి సస్పెన్షన్



చంద్రగిరి, మే 20 : సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎర్రావారిపాలెం మండలం ఉదయ మాణిక్యం గ్రామానికి చెందిన వైసీపీ నేత ఎమ్మార్సీ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడైన ఎమ్మార్సీ రెడ్డి ప్రస్తుతం వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా ఉన్నారు.చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రావారిపాలెం, తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లో వైసీపీలో చురుగ్గా ఉన్న నాయకులను టీడీపీలోకి పంపించడంలో ఈయన హస్తం ఉందని, తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.

అంబులెన్స్ ఢీకొని 11గొర్రెల మృతి

గూడూరు, మే 20: మండల పరిధిలోని తిరుపతిగారిపల్లిలో సోమవారం రాత్రి గొర్రెల మందను ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, 11 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు వెంకటగిరి నుంచి ఓ రోగిని అత్యవర చికిత్స కోసం ఆసుపత్రికి చేర్చేందుకు ఓ ప్రైవేటు అంబులెన్స్ నెల్లూరుకు వెళ్లింది. తిరిగి నెల్లూరు నుంచి వెంకటగిరి వస్తుండగా మార్గమధ్యంలోని తిరుపతిగారిపల్లె వద్ద అదుపుతప్పి గొర్రెల మందను తొలుకుని వెళ్తున్న ఈశ్వరమ్మను, గొర్రెలను ఢీ కొంది. ఈ ప్రమాదంలో 11 గొర్రెలు మృతి చెందగా ఈశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుమారు గొర్రెల పిల్లల నష్టం రూ.1.50 లక్షలు వాటిల్లిందని బాధితురాలు ఆవేదన చెందుతున్నారు. గూడూరు రూరల్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కోట, మే 20: మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.నాగార్జునరెడ్డికి డాక్టరేట్ ప్రదానం కావడంతో సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. 'ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఎర్లీ డయాగ్నొస్టిక్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్' అనే అంశంపై ఎన్‌బీకేఆర్ ఈసీఈ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునరెడ్డి పరిశోధనలను అనంతపురం జెఎన్‌టీయుపీ వర్సిటీకి పంపించారు. ఈయన పంపిన పరిశోధనలు ఉత్తమమైనవిగా ఎంపికై ఆ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగార్జున్‌రెడ్డిని కళాశాల డైరెక్టర్‌తోపాటు ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ హరినాథరెడ్డి, పలు విభాగాధిపతులు అభినందించారు.

నయన రగడ పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్) మే 20: చక్రపాణి రంగనాథకవి రచించిన నయనరగడ లఘుకావ్య సంవీక్షణం అనే పుస్తకాన్ని సోమవారం స్థానిక ఎయిర్ బైపాస్ మార్గంలోని రాస్ భవనంలో జరిగిన సభలో ఆవిష్కరించారు. సభకు అధ్యక్షులుగా పంచ సహస్రావధాని మేడసాని మోహన్, ఆత్మీయ అతిథిగా దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో, డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్. రామారావు హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయపీఠం సంచాలకులు డాక్టర్ కలువగుంట రామమూర్తి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర నాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాలడుగు మునిరత్నం నాయుడు, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జీఎన్ సత్యనారాయణ సింగ్ హాజరయ్యారు. విశ్రాంత తెలుగు ఆచార్యులు కె.సర్వోత్తమరావు పుస్తకావిష్కరణ చేశారు. శతావధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో పుస్తక రచయిత, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, డాక్టర్ బత్తల శ్రీరాములు, డాక్టర్ పురుషోత్తమాచారి, ఏనుగు అంకమ నాయుడు, వేమూరి జయరామ్ ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయిత శ్రీరాములు కుటుంబం, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

పులివర్తి నానికి సోమిరెడ్డి పరామర్శ



తిరుచానూరు, మే20: ఈనెల 14న వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని సోమవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, బంగారుపాళెం మండల అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, తిరుపతి టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళి, పాకాల జడ్పీటీసీ పద్మజారెడ్డి ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు తెగబడుతోందని ఆరోపించారు. పులివర్తి నానికి భారీ మెజార్టీ ఖాయమన్నారు.

22న లక్ష్మీనరసింహుడి జయంతి

బాలాయపల్లి, మే 20: మండలంలోని అలిమిలి పంచాయతీ పరిధిలో కనుమరాయకొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22న స్వామివారి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జయంతిని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

వెంకటగిరి టౌన్, మే 20: హనుమాన్ శోభాయాత్రను ప్రతి హిందువు జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక పెరుమాళ్ స్వామి ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న హనుమాన్ శోభాయాత్ర జరుగుతుం దన్నారు.మల్లికార్జున్, సుధాకర్, పురుషోత్తం, నర్రారవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి: ఎంఎస్ఎఫ్



నిరసనలో ఎంఎస్ఎఫ్ నాయకులు

వెంకటగిరి టౌన్, మే 20: క్రాస్ రోడ్డులో భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించి వెం టనే శిక్షించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 'చలో వెంకటగిరి' ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నామని తెలిపారు. కోడ్ అనంతరం అధికారులు, రాజకీయ నాయకులు అంబేడ్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గూడూరు ఆర్డీవో, డీఎస్పీ మాట ఇచ్చి ఉన్నారని తెలిపారు. విగ్రహ పునఃనిర్మాణం జరగకపోతే మహా ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. ఎం.సురేష్, గోపాల్, మణి, రవి, శంకర్, రాజకుమార్‌తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

బాలిక మృతి, ఐదుగురికి గాయాలు



మృతి చెందిన అయిషా సమీన - గాయపడిన రజాక్ అహ్మద్, యాస్మిన్, షాధిక్ అహ్మద్, బషీర్

నారాయణవనం, మే 20: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన నారాయణవనం మండల పరిధిలోని గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద సోమవారం రాత్రి జరిగింది. రేణిగుంట బుగ్గవీధికి చెందిన రజాక్ అహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి నాగలాపురం మండలం టీపీ కోట వద్ద ఓ శుభకార్యానికి వెళ్లారు. సోమవారం రాత్రి కారులో రేణిగుంటకు వెళ్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న మరో కారు గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రజాక్ అహ్మద్(35), అతని భార్య యాస్మిన్(29), కుమార్తె అయిషా సమీన(10), కుమారులు షాధిక్ అహ్మద్(8), రెహ్మాన్ అహ్మద్(1), కారు డ్రైవర్ బషీర్(58) గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా అయిషా సమీనా(10) మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జయరాం నాయక్ తెలిపారు.

విమానం రద్దు కావడంతో ప్రయాణికుల నిరసన



స్టార్‌ఎయిర్‌లైన్స్ టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

రేణిగుంట, మే 20: తిరుపతి విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం ఒక విమాన సర్వీసు రద్దు కావడంతో ప్రయాణికులు నిరసన తెలిపారు. బెంగళూరు నుంచి సాయంత్రం 3.10గంటలకు తిరుపతి చేరుకుని తిరిగి 4.20గంటలకు గుల్బార్గాకు స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం చేరుకోవాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా సర్వీసు రద్దయింది. అయితే ఒకటిన్నర గంట ముందుగా 32మంది ప్రయాణికులు విమానాశ్రయం చేరుకున్నారు. విమాన సర్వీసు రద్దయిన విషయం తెలుసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్టార్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం స్పందించకపోవడంతో టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.మంగళవారం వస్తే గుల్బర్గాకు యధాతధంగా పంపిస్తామని చెప్పడంతో కొంతమంది టిక్కెట్ డబ్బులు తీసుకుని వెళ్లిపోగా కొంతమంది ఆ ప్రతిపాదనకు ప్రయాణించేందుకు అంగీకరించారని సమాచారం.

రోడ్డుపై గుంతలను పూడ్చిన స్థానికులు



గూడూరు అర్బన్, మే 20: పట్టణంలోని తిలక్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న గుంతలను సోమవారం స్థానికులే శ్రమదానం చేసి పూడ్చారు. తిలక్ నగర్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే మార్గంలో గత కొద్ది నెలలుగా రోడ్డుపై గుంతలు ఏర్పడంతో వాహనదారులు అవస్థలు పడుతుండేవారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించ లేదు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయి. దీంతో స్థానికులే సొంతనిధులను వెచ్చించి గుం తలను పూడ్చారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి



చిల్లకూరు, మే 20: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అం తకు ముందు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై అధిష్టింపజేసి ఆలయ ఆవరణలో స్వామివారిని ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

రైలు ఢీ కొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మే 20 : నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు... సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని యువకుడు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. నీలిరంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి సూళ్లూరుపేట ఇన్‌చార్జి రైల్వే ఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు ఢీకొని ఒకరికి గాయాలు

దక్కిలి, మే 20: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. డీ కోడక్కిలి మండలం కమ్మపల్లి నుంచి గ్రావెల్ లోడ్ చేసుకుని వెళ్తున్న ట్రాక్టరు బైకుపై వస్తున్న శివరాజను ఢీ కొంది. ఈ ఘటనలో శివరాజ కాలు విరగడంతో ఆయన్ను దక్కిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

వివాదాలు సృష్టిస్తే చర్యలు

చిట్టమూరు, మే 20: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఆయా పార్టీల కార్యకర్తలు వివాదాలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్న బలరామయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికలు ముగిసినప్పటికి మండలంలోని కొన్ని పార్టీల కార్యకర్తలు వివాదాలకు ఆజ్యం పోస్తున్నారన్నారు. అలాంటి సంఘటనలు జరిగితే పూర్తి బాధ్యత ఆ పార్టీలకు చెందిన నాయకులే కారకులవుతారన్నారు. జూన్ నెల 4న జరిగే కౌంటింగ్‌పై గ్రామాల్లో బెట్టింగులకు పాల్పడడమే కాకుండా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలపై ఎక్కడైన బెట్టింగ్‌లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నట్లు గ్రామస్తులకు తెలిస్తే పోలీసులకు దృష్టికి తీసుకరావాలని కోరారు.

కోళ్ల పంపిణీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టండి

సూళ్లూరుపేట, మే 20: మండల పరిధిలోని మంగానెల్లూరులో పోలింగ్ ముందు రోజు కోళ్ల పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సర్పంచు సుధాకర్ సోమవారం ఆర్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పోలింగ్ ముందు గ్రామంలో ఓటర్లకు కోళ్లు పంపిణీ చేసిన వైసీపీ నాయకులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరాడు. గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎన్నికల అధికారులు ఆదేశించారన్నారు. అయితే గ్రామ కార్యదర్శి వి.రాజారెడ్డి ఆధ్వర్యాన విలేజ్ మహిళా పోలీసు, వీఆర్పీ గ్రామంలో తూతూమంత్రంగా విచారణ చేపట్టి ఉల్లంఘన జరగలేదని అధికార పార్టీకి అనుకూలంగా నివేదిక ఇచ్చారన్నారు. కోళ్ల పంపిణీ చేసిన మాట వాస్తమని గ్రామంలో అందరి సమక్షంలో అధికారులు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. కోళ్ల పంపిణీపై ఆధారాల సహా ఫిర్యాదులో ఇచ్చామన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని వినతి

మండల పరిధిలోని కుదిరి చెరువులో అధికార పార్టీ నాయకులు ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని దీనిని అడ్డుకొని సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఇక్బాల్‌కు కౌన్సిలర్ చిట్టిబాబు వినతి పత్రం అందజేశారు. పరిశీలించి సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వాక్యూమ్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సు


హాజరైన పరిశ్రమలు, విద్యాసంస్థల ప్రతినిధులు

ఏర్పేడు, మే 20: తిరుపతి ఐఐటీలో వాక్యూమ్ టెక్నాలజీ, ప్రాసెస్ అప్లికేషన్స్‌లో వారం రోజుల వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ప్రొఫెసర్ వి.వాసుదేవరావు, డాక్టర్ కోటేశ్వరరావు, ఐఐటీ భౌతికశాస్త్ర విభాగం సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ సహకారంతో ఈ కోర్సును ప్రారంభించారు. ఇంటెన్సివ్ లెర్నింగ్ అనుభవాన్ని అందించడం, నైపుణ్యం అభివృద్ధి, వృత్తిపరమైన వృద్ధిని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మే 25వ తేదీ వరకు ఈ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ఐఐటీ డీన్ శశిధర్ గుమ్మ తెలిపారు. సాంకేతిక పురోగతిలో నిపుణులు ముందంజలో ఉండేలా ఈ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. విభిన్న పారిశ్రామిక, విద్యా నేపథ్యాల నుంచి సహచరుతలతో, విశిష్ట ఫ్యాకల్టీ సభ్యులతో నెట్‌వర్క్ నుంచి నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇస్రో డీఆర్డీవో సిమెన్స్ బ్రహ్మోస్, పిఫైపర్ తోష్నివాల్, టెక్సోల్, బుసచ్, గీతం యూనివర్శిటీ ఎస్వీ యూనివర్శిటీ అనేక ఇతర ప్రముఖ కంపెనీలు, విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిపుణులు పాల్గొన్నారు.

ఐఐటీలో డేటా అనాలసిస్‌పై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులు

ఏర్పేడు, మే 20: తిరుపతి ఐఐటీలో రీసెర్చ్ మెథడాలజీ, మల్టీ వారియట్ డేటా అనాలసిస్‌పై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. పూర్వవిద్యార్థుల వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ శశిధర్ గుమ్మ, హెచ్ఎస్ఎస్ విభాగం అధిపతి డాక్టర్ ప్రభాశంకర్ ద్వివేది ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ వర్క్‌షాప్‌లో 40మంది పాల్గొన్నారు. క్రియా విశ్వవిద్యాలయంలోని ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఫ్యాకల్టీ సభ్యులతో పాటు డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ వనీత్ కశ్యప్, డాక్టర్ విష్ణు సి.రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయండి


ఎమ్మార్సీలో సెక్టోరియల్ అధికారులు

నాగలాపురం, మే 20: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని జిల్లా సెక్టోకియల్ అధికారులు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం నాగలాపురంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని సెక్టోరియల్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. 0 నుంచి 18 సంవత్సరాల వరకు ప్రత్యేక ప్రతిభా వంతులను సర్వే చేసి వారిని భవిత కేంద్రాలకు రప్పించాలన్నారు. వీరికి కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబయ్య, ఉపాధ్యాయులు జయపాల్, వసంత, సీఆర్పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమావేశం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, మే 20: పట్టణంలోని భాస్కరపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మందల బాలాజీ, జి.బాబు, బి.చిరంజీవి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రామిరెడ్డి, రాఘవులు, నాగేశ్వరరావు, నళిని, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

గురవారెడ్డికి సన్మానం



శ్రీకాళహస్తి, మే 20: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, గుమ్మడిపూడి దశరధాచారి సోమవారం సన్మానించారు. నెమలూరు బుజ్జి, సుబ్బయ్య, మునిరాజా యాదవ్, బాలాజీరెడ్డి, నాగేశ్వరరావు, మునెయ్య, బాలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మృతుల కుటుంబానికి పరామర్శ


బాబును పరామర్శిస్తున్న విజయబాబు

వడమాలపేట, మే 20: వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బాబు, ఆయన భార్య విజయను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు సోమవారం పరామర్శించారు. బాబు దంపతుల ముగ్గురు కుమార్తెలు గురువారం దిగువ గూళూరు గూళూరు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోతుగుంట విజయ్‌బాబు ఎస్‌బీఆర్ పురం వెళ్లి బాబు దంపతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు పరమేశ్వరమంగళనం ఎంపీటీసీ సభ్యుడు శ్రీజ బాలజీనాయుడు, టీడీపీ రాష్ట్ర వాణిస్య విభాగం కార్యదర్శి రవి నాయుడు, ధనపాల్, నవీన్, అప్పయ్య, నరసింహారాజు, రమేష్, మణికంత, నాగూర్ ఉన్నారు.

మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రేణిగుంటలో కుళాయిల రాజకీయం


పాంచాలినగర్‌లో కుళాయి కనెక్షన్ల కోసం గాడి తవ్వుతున్న దృశ్యం

రేణిగుంట, మే 20: రేణిగుంట పంచాయతీ పరిధిలోని పాంచాలి నగర్, బుగ్గ వీధి, జ్యోతినగర్, పతనికులం, అన్నయ్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో గత వారం వున్నట్లుండి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. పంచాయతీ తీర్మానం, టెక్నికల్ అధికారి అనుమతులు లేకుండా కుళాయి కనెక్షన్లు ఇవ్వడం వెనుక అధికార పార్టీ ఓట్ల రాజకీయం వుందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. వైసీపీ ముఖ్య నాయకుడి ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు వైసీపీ బలహీనంగా వున్న ప్రాంతాల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకే కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు డైరెక్ట్ లైన్ నుంచి 24 గంటల కుళాయి కనెక్షన్లు కొంతమందికి ఇచ్చి రూ.20వేల నుంచి రూ.50వేల వరకూ వసూలు చేసుకున్నారన్న ఆరోపణలు కూడా విన్పిస్తున్నాయి. తాగునీటి సమస్య అధికంగా ఉన్న కాలనీలను వదిలేసి స్థానిక ప్రజాప్రతినిధుల ప్రాధాన్యం మేరకు ఎన్నికలకు మూడు రోజుల ముందు కుళాయి కనెక్షన్లు ఇచ్చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్డుపైనే ఇనుప పైపుల ద్వారా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు.పాంచాలినగర్, బిస్మిల్లా నగర్ ప్రాంతాల్లో ఏకంగా 5 అంతస్తుల అపార్ట్‌మెంట్లకు కూడా 24గంటల కుళాయి కనెక్షన్లు ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి.

సర్పంచ్‌పై వాట్సప్ గ్రూప్‌లో దుమారం

రేణిగుంట పట్టణం గౌరీనగర్‌లో సోమవారం బోరు వేస్తుండగా వార్డు మెంబరు కార్యదర్శి రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేసి పనులను ఆపేయించారు. అయితే వాట్సప్ గ్రూప్‌లో సర్పంచ్ నగేశం డబ్బు తీసుకుని బోరుకు అనుమతి ఇచ్చారని వార్డు మెంబరు ఎంజీరెడ్డి పోస్టు పెట్టడం, సర్పంచ్ అనుచరులు వాట్సప్ గ్రూప్‌లో ఖండిస్తూ పోస్టులు పెట్టడంతో దుమారం రేగింది.

భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం


ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 35వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,189మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,041మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 3,165మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,144, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 341మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 220మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 54మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 23,520 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీపీ అగ్రహారంలో జాతర సందడి


బీపీ అగ్రహారంలో విద్యుత్ అలంకరణలు

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారంలో జాతర సందడి నెలకొంది. ఏటా తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకుని బీపీ అగ్రహారంలో వెలసిన గంగమ్మ ఆలయం వద్ద జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు జరగబోయే గంగమ్మజాతర వేడుక కోసం గంగమ్మ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు బీపీ అగ్రహారం ప్రాంతాన్ని విద్యుత్ దీపాలంకరణలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. మంగళవారం రాత్రి గంగమ్మ ఆలయం నుంచి ఉత్సవమూర్తి ఊరేగింపు ప్రారంభం కానుంది. బుధవారం ఉదయం తిరిగి అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ఎదుట కొలువుదీర్చనున్నారు. అక్కడ రాత్రి వరకు అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. తిరిగి చివర్లో అమ్మవారి నిమజ్జనం మహోత్సవంతో జాతర ముగింపు జరుగుతుంది. బీపీ అగ్రహారం ప్రాంతంలో సోమవారం నుంచే జాతర సందడి నెలకొంది. గతంలో బీపీ అగ్రహారం జాతర సందర్భంగా పలుమార్లు ఘర్షణలు చోటు చేసుకున్న విషయం వెలుగుచూశాయి. ఇటీవల బీపీ అగ్రహారంలో శ్రీరామనవమి రోజున రాములవారి మందిరానికి సారె సమర్పించే విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణకు దారి తీసింది. ప్రస్తుత 144సెక్షన్ పరిస్థితుల దృష్ట్యా బీపీ అగ్రహారం జాతరలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

శ్రీకాళహస్తి, మే 20: ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు జ్ఞానాంబవారి మధురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిపంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బుగ్గ హరి, ముత్తంశెట్టి చిన్నరాయల్, రఫీ, జలగం గిరి, బాబు, మునిప్రసాద్, గఫూర్, బాబా, షకీల్, కమల, రసూల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అంబలిస్వామి ఆశ్రమం వద్ద జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో వంకాయల సిద్ధులయ్య, ఎంఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని టీపీకోటలో సోమవారం 'జై బాలయ్య అభిమాన సంఘం' ఆధ్వర్యంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు రషీద్, దావూద్, మహబూబ్‌బాషా, సద్దాం, ఈసుబ్, అమీర్, షాదిక్, ఇంతియాజ్, షమీర్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోటి, పురుషోత్తం, తేజ, గోపి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం త్రయోదశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా ప్రదోష నందిసేవ జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రాల నడుమ నందిపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

నాగలాపురం, మే 20: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో సోమవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు చేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడిని వివిధ పుష్పాలతో పుష్పాలంకరణ చేపట్టి మహాహారతి, నక్షత్ర హారతి, కుంభ హారతులు ఇచ్చారు. ప్రదోష పూజానంతరం ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లకు ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న దాతలు

పిచ్చాటూరు, మే 20: పిచ్చాటూరులోని నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంస్థ సెక్రటరీ వసంత పాల్ రత్నం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఉచితంగా ట్రై సైకిళ్లు సోమవారం పంపిణీ చేశారు. నెహ్రూ యువజన సేవా సంఘం డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు పిచ్చాటూరు, నింద్ర, నగరి, నాగలాపురం మండలాల్లో 30మంది పిల్లలకు ట్రైసైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది లోకేష్, బాలకృష్ణ, సుమన్, జవహర్, అరుల్, అగస్టిన్, మునిబాల, పాండి, ఉదయ్ పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

కేవీబీపురం, మే 20: మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో కూరగాయలు ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.60 నుంచి రూ.80 మధ్య విక్రయించారు.

శేషవాహనంపై చెన్నకేశవుడి చిద్విలాసం



శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి సోమవారం శేషవాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప, దీపనైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి అమ్మవార్లు శేషవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కమిషనర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు


కమిషనర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్ రమేష్ బాబు జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఆయనను సన్మానించి కేక్ కట్ చేయించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఉమామహేశ్వరరావు, మధుసదూన్‌రెడ్డి, లలిత, సింధు, లలిత, ప్రియాక, రవికాంత్, బాలచంద్రయ్య, సురేష్, వంశీకృష్ణ, జావిద్ అహ్మద్, హుస్సేన్ అహ్మద్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తి నుంచి తిరువణ్ణామలైకు పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. 22వ తేదీ ఉదయం 5.30, 10.0, 11.45గంటలకు శ్రీకాళహస్తి నుంచి తిరువణ్ణామలైకు బస్సులు బయలు దేరుతాయన్నారు. బస్సు చార్జీ రూ.350 అని, రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. వివరాలకు 7382880239, 7382880178 నెంబర్లను సంప్రదించాలని డీఎం సూచించారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం


స్వామి అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం సోమవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు నరసింహస్వామి జయంతి

శ్రీకాళహస్తి, మే 20: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన భక్తకన్నప్ప ఆలయం సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నరసింహస్వామి జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9గంటలకు స్వామివారికి పూజాకార్యక్రమాలు మొదలవుతాయని, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పాఠశాలకు చేరిన నోటు పుస్తకాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సరఫరా చేసిన నోటు పుస్తకాలు సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరినట్లు ఎంఈవో-2 మునిసుబ్రహ్మణ్యం తెలిపారు.

కాలువ పూడికతీత

బుచ్చినాయుడుకండ్రిగ, మే 20: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని తెలుగుగంగ ఉప కాలువ పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి.